"నాకెందుకో అనుమానంగా వుంది. వర్షంలో ఆ పిల్లల్ని వాళ్ళు బయటకు తీసుకు వస్తారని. మీరు అనుకుంటున్నారుగాని - నాకు అలా అనిపించటం లేదు. అంత రిస్కు తీసుకోరు. వాళ్ళకి పిల్లలమీద అంత దయాదాక్షిణ్యాలు వుంటాయని కూడా నేననుకోవటం లేదు. వర్షపు చలికి ఆ దుండగులుగానీ బయటకువస్తే, నేను లోపలేవుండి పిల్లల్ని అట్నుంచి కవర్ చేయటానికి ప్రయత్నిస్తాను."

ఆమె మారు మాట్లాడకుండా తన రివాల్వర్ ఇచ్చింది. అతడు దాన్ని తీసుకుని చీకట్లో కలిసిపోయాడు. ఆమె అతడు వెళ్ళిన వైపే చూస్తూ వుండిపోయింది.

ఎందుకో తెలీదు.... ఆమెకి అకస్మాత్తుగా పరమేశ్వరం జ్ఞాపకం వచ్చాడు. ఇతడికి, పరమేశ్వరానికీ చాలా దగ్గిర పోలికలున్నాయి. అదే షార్ప్‌నెస్... సి.బి.ఐ. ఆఫీసర్లు కూడా చాలా దగ్గిర పోలికలున్నాయి. అదే షార్ప్‌నెస్.... సి.బి.ఐ. ఆఫీసర్లు కూడా ఆలోచించలేని కోణంలో వేగంగా ఆలోచించగలగటం....

చల్లటిగాలి ఆమెని సున్నితంగా స్పృశించింది. ఆమెకి సడెన్‌గా చాలా రిలాక్సింగ్‌గా అనిపించింది. తెలివి తేటలకు సంబంధించినంత వరకు ధర్మానికి అటువైపున పరమేశ్వరం వుంటే ఇటువైపు యితనున్నాడు. బలం, అధికారం అటుంటే, ఇటు సమవుజ్జీగా తనుంది! ఈ రెండు శక్తులూ కలిసి ఆ నాలుగు స్తంభాల్నీ పడగొట్టటం పెద్ద కష్టం కాకపోవచ్చు. ఈ వైకుంఠపాళిలో పైకి వెళ్ళటానికి ఇన్నాళ్ళకి తనకో అధారం దొరికింది. డిపార్టుమెంట్‌లో ఇతనికన్నా తెలివైనవాళ్ళు వుండొచ్చుగాక, కాని ప్రభుత్వంలో ఏ సంబంధమూ లేకుండా యింత 'కమిట్‌మెంట్' వుండేవాళ్ళు చాలా చాలా తక్కువ దీన్నే పౌరబాధ్యత అంటారేమో!

ఆమె ఆలోచనల్లో ఉండగానే 'హాల్లో' అని వినిపించింది. ఆమె ఉలిక్కిపడి చూసింది. చుట్టూ ఇరవయ్ మంది ఆఫీసర్లు.... చీఫ్ దగ్గిర కొచ్చాడు. "అన్ని ఏర్పాట్లూ జరిగిపోయాయి" అన్నాడు.

ఆమె చాలా థ్రిల్లింగ్‌గా ఫీలయింది. తన డిపార్టుమెంట్ యిది. ఆమెరికన్, రష్యన్ గూఢచారి సంస్థలకి ఏమాత్రం తీసిపోని చాకచక్యం వున్న అధికారులు తమకీ వున్నారు. ఇంత దగ్గిరలో వున్న తనకే ఏమాత్రం అనుమానం రాకుండా ఫైర్ ఇంజెన్‌లతో సహా తీసుకురావటం సాధ్యమయ్యే పనికాదు.

"స్టార్ట్ ది ఆపరేషన్" సూచించాడు చీఫ్. ప్రవల్లిక తన ప్లాను వివరించింది. ఫ్లడ్ లైట్లు జాగ్రత్తగా అమర్చటం జరిగిపోయింది. లోపలున్న పిల్లలు పడుతూన్న కష్టాలు తల్చుకుని ప్రతీవాళ్ళూ ఒక రకమైన కసితో చకచకా పనులు చేస్తున్నారు.

"ఫైర్ ఇంజెన్ రేంజి సరిపోతుందా?" అడిగింది.

"సరిపోతుంది మేడమ్" కంట్రోలర్ ఆఫ్ ఫైర్ సర్వీసెస్ స్వయంగా వచ్చాడు. అందుకే అన్నారు. 'సారే జహాసె అచ్ఛా హిందుస్తాన్ హమారా' అని. ఆంప్లిఫయర్ దగ్గిర ఇంజనీరు

చెవులు చిల్లులు పడేలా ఉరిమిన శబ్దం.

వర్షం మొదలయింది.

గోడమీదకి జాగ్రత్తగా ఎక్కుతున్న విహారిమీద మొదటి నీటి చుక్క పడింది. అతడు కూడా ఇంత నిశ్శబ్దంగా, ఇంత వేగంగా పని జరుగుతున్నందుకు ఆశ్చర్యపోయాడు.

టెర్రరిస్టులు కూడా ఆకాశంవైపు చూశారు. చీకట్లో ఏమీ కనపడలేదు. వర్షం ఎక్కువైంది.

"చెట్టుకిందకి పోదామా?"

"వద్దు-పిల్లలు తప్పించుకుంటే కష్టం. ఏ ఒక్కరు బయటకు వెళ్ళినా మన గురించి చెప్పేస్తాడు."

"పాడు వర్షం....." అంటూ ఒకడేదో బూతుమాట అన్నాడు. ఒక కుర్రవాడు ఏడవటం మొదలుపెట్టాడు. "నోర్మూసుకోకపోతే చంపేస్తాను" అరిచాడో టెర్రరిస్టు.

నీటిధార మరింత ఎక్కువయింది.

"నేను చెట్టుకిందకి పోతున్నాను."

"నేను కూడా వస్తాను..... ఒరేయ్, నువ్విక్కడే వుండు. పిల్లలు జాగ్రత్త" అందర్లోకి జూనియర్‌లా కనపడుతున్న వాడికి చెప్పి ఇద్దరూ బయటకు పరుగెత్తారు.

విహారి వూపిరి బిగపట్టాడు.

తమ ప్లాను ఫలించింది. బయటకు వెళ్ళి వాళ్ళిద్దరూ బంధింప బడగానే లోపలున్న వాడిని కాల్చి చంపడం పెద్ద కష్టం కాదు.

రెండు నిమిషాలు గడిచాయి.

బయట... నల్లదుస్తుల్లో వున్న ఆఫీసర్లు నెమ్మదిగా టెర్రరిస్టులున్న చెట్టు చుట్టూ వలయంగా చేరుకుంటున్నారు.

విహారి పిస్టల్‌ని రేంజిలోకి తీసుకున్నాడు.

ప్రవల్లిక గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. చేప గాలానికి దగ్గరగా వచ్చింది. నిశ్శబ్దంగా పట్టెయ్యాలి అంతే.

ఇంకొక్క క్షణం ఆగితే అదే జరిగేది కానీ అంతలోనే అనూహ్యమైన సంఘటన జరిగింది.

దూరంగా వాహనాలు శబ్దం చేసుకుంటూ రావడం వినిపించింది. కొద్దిసేపటికి లైట్లు కనపడ్డాయి. అనుకోని ఈ సంఘటనకు ఆఫీసర్లు బిత్తరపోయారు. ప్రవల్లిక నిశ్చేష్టురాలయింది.

కార్లు, స్కూటర్లు, మోపెడ్లు- ఏది దొరికితే అది వేసుకుని పేరెంట్సు అక్కడికి వచ్చేశారు. ఆ రెండ్రోజుల సామీప్యంలో వాళ్ళు ఒకరికొకరు దగ్గరయ్యారు. ఒకర్నొకరు ఓదార్చుకున్నారు. ఫలానాచోట పిల్లలున్నారట అని తెలిసింది. అంతే! ప్రవాహంలా బయల్దేరారు. అడ్డు పెట్టేవాడే లేకపోయాడు.

ఒక్కసారిగా అన్ని లైట్లు తామున్న చోటికి దూసుకువస్తూ వుండడంతో - పోలీసులే అనుకున్నారు వాళ్ళు.

భవంతివైపు వస్తున్న టెర్రరిస్టులని విహారి కూడా చూశాడు.

అతడి మెదడు చురుగ్గా పనిచేసింది.

లోపలున్న మనిషికేసి మరేమీ ఆలోచించకుండా రివాల్వర్ పేల్చాడు. లోపలున్న టెర్రరిస్టు చేతికి గాయమైంది. ఆర్తనాదం చేస్తూ మిషన్‌గన్ వదిలేశాడు.

ఆ చప్పుడికి భవంతివేపు పిస్టల్ శబ్దాన్ని వాళ్ళు ఊహించలేదు.

ఆ అరక్షణం చాలు, ప్రవల్లికకి చక్కటి అవకాశం దొరికింది. విహారి చర్యని మనుసులోనే అభినందిస్తూ "లైట్స్" అని అరిచింది. ఒక్కసారిగా అన్నివైపుల్నించీ లైట్లు వెలిగాయి. అనుకోని ఈ పరిణామం బయటవున్న టెర్రరిస్టులని మరింత భయభ్రాంతుల్ని చేసింది.

ఈ హడావుడికి పిల్లలందరూ ఉత్తేజితులయ్యారు. ముఖ్యంగా విష్ణు.

నీటిధార ఆగిపోయింది. లైట్ల వెలుతురులో అక్కడి ప్రదేశమంతా పట్టపగలుగా మారింది. విహారి గోడమీదనుండి లోపలికి దూకి "రన్..... బోయ్స్... రన్" అని అరిచాడు. పరిస్థితి అందరికన్నా మొదట అర్థం చేసుకున్నవాడు విష్ణు. వాడు ముందు బయటకు పరుగెత్తాడు.

అక్కడే చిన్న తప్పు జరిగింది.

విష్ణుని బయటవున్న టెర్రరిస్టు ఒకడు పట్టుకుని మిషన్‌గన్ గురి పెట్టాడు. మిగతా పిల్లలగురించి వాళ్ళు పట్టించుకోలేదు. భవంతిలోంచి బయటపడ్డ పిల్లలు అప్పుడే అక్కడకొచ్చిన తల్లి దండ్రుల దగ్గరకి పరుగెత్తారు. అన్ని గంటలపాటు పడిన భయం, టెన్షన్, శ్రమ- అన్నీ మరిచిపోయి పిల్లలు వెళ్ళి తమతమ తల్లిదండ్రుల కౌగిళ్ళలో ఒదిగిపోయారు. అక్కడి దృశ్యం హృద్యంగా వుంది. తల్లులు పిల్లల్ని హృదయాలకు హత్తుకుని ఆనందంతో ఏడుస్తున్నారు. పిల్లలు తల్లులు మెడచుట్టూ చేతులు వేసి అతక్కుపోయారు.

సునాదమాల ఒక్కతే మిగిలిపోయింది.

ఆమె దృష్టి టెర్రరిస్టుల మధ్య చిక్కుకుపోయిన విష్ణుమీద పడింది. అంతే! ఆమె ఆగలేదు. గాలివేగంతో అటు పరుగెత్తింది. ప్రవల్లిక "నో...నో" అని ఆరుస్తూనే వుంది. సునాదమాల వినిపించుకోలేదు. ఆమె మదిలో మెదులుతున్నది ఒకే ఒక విషయం. పిల్లలందరూ తమ తమ గూళ్ళకి చేరుకున్నారు. ఒక్క విష్ణు మాత్రం వాళ్ళ దగ్గర వుండిపోయాడు. తమ విష్ణుని మాత్రం వాళ్ళు పట్టి వుంచారు.

ఆమె భయస్తురాలు కావొచ్చు. గట్టిగా మాట్లాడడానికి కూడా జంకేది కావొచ్చు. కానీ ఆ క్షణం విష్ణుమీద ఆమె ప్రేమ దేన్నీ ఆలోచించేలా చెయ్యలేదు. పరుగెత్తుకెళ్ళి విష్ణుని వాళ్ళ చేతుల్లోంచి లాక్కోవడానికి ప్రయత్నించింది.

ఈ లోపులో విహారి లోపల్నుంచి టెర్రరిస్టుతో సహా బయటకు వచ్చాడు. ఉగ్రవాది చేతినుంచి రక్తం స్రవిస్తూంది. ఇద్దరికీ బయట జరుగుతున్నది తెలీదు. విహారి బయట దృశ్యాన్ని చూసి విస్తుబోయాడు.

చేసేదిలేక వదిలేశాడు విహారి, అందుకుని, విహారి చెంపమీద బలంగా కొట్టాడు చేతికి గాయమైన ఉగ్రవాది.

"చీఫ్.... ఒక కారు మాకు వదిలి మీరంతా దూరంగా వెళ్ళండి. ఈ పిల్లాడు, ఈ అమ్మాయీ మాతో వస్తారు. మేము సురక్షిత ప్రాంతానికి వెళ్ళిన తరువాత వీళ్ళని వదిలేస్తాం. మీరు మమ్మల్ని ఫాలో అయినా, మాకు అపకారం తలపెట్టినా వీళ్ళు ప్రాణాల్తో దక్కరు."

చీఫ్, ప్రవల్లిక మొహమొహాలు చూసుకున్నారు.

ఏం చెయ్యాలో పాలుపోలేదు. ఆ కిరాతకులు అనుకున్నంతా చేయగల సమర్థులు. వాళ్ళని పట్టుకోవడం కోసం యిద్దర్ని బలిపెట్టడం అవివేకం. చీఫ్ ఒక నిర్ణయానికి వచ్చిన వాడిలా తమ ఆఫీసర్లను తప్పుకొమ్మన్నట్టు సైగచేశాడు. టెర్రరిస్టులు సునాదమాలనీ, విష్ణుని తీసుకుని కారు వద్దకు నడిచారు. వాళ్ళందరూ కారు ఎక్కుతూండగా "ఆగండి!" అన్నాడు విహారి. అందరూ అటువేపు చూశారు.

విహారి రెండు చేతులూ పైకెత్తి రాళ్ళదగ్గరకి వెళ్ళాడు. "మీరు కావాల్సింది మీతోపాటు బందీగా ఒకరు రావడం. అంతేగా, వాళ్ళబదులు నేను వస్తాను. వాళ్ళని వదిలిపెట్టండి" అన్నాడు.

"వీల్లేదు" అన్నాడు వాళ్ళలో ఒకడు.

అక్కడ సూదిపడితే వినపడేటంత శబ్దం.

ఆ ముగ్గురిలోకీ నాయకుడిలా వున్నవాడు "......రానీ" అన్నాడు. విహారి అతడివైపు ఆశ్చర్యంగా చూశాడు. అంత తొందరగా వాళ్ళు ఒప్పుకుంటారని అతడు అనుకోలేదు. (దానికి కారణం కారు ఎక్కాక తెలిసింది.)

ఒకడు విహారి దగ్గిరకివచ్చి జేబులు చెక్ చేశాడు. తరువాత కారు దగ్గిరకి తీసుకెళ్ళి "ఎక్కు" అన్నాడు.

అక్కడే సునాదమాల నిలబడివుంది. విష్ణుని పొదివి పట్టుకుని వుంది. పూర్వపు భయం ఆమెలో తిరిగి చోటు చేసుకుంది. భయం భయంగా చూస్తోంది. విహారి ఆమెని చూసి నవ్వేడు... "గంటలో వదిలేస్తారు. రేపు బస్‌స్టాప్‌లో కలుసుకుందాం."

ఆమె జవాబు చెప్పలేదు.

"మీరు నాకు థాంక్సే చెప్పలేదు...."

"థా.......థా....థాంక్స్"

"ఒక 'థా' నా? మూడు 'థా' లా?"

వెనుకనుంచి నాయకుడు విహారిని కారులోకి తోశాడు. అతడు కారెక్కగానే, "ఏయ్! నువ్వు మాతో రా." అన్నాడు తుపాకీతో సూచిస్తూ.

అందరి కళ్ళూ అటువైపు తిరిగాయి.

అక్కడ ప్రవల్లిక వుంది.

జనంలో కలకలం రేగింది. చీఫ్ అడుగు ముందు కేశాడు. ఆమె ఆయన్ని వారించి కారు దగ్గిరగా నడిచింది. పిల్లల్నించి ఈ ఉగ్రవాదుల్ని దూరంగా ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా తీసుకెళ్ళాలి. వీళ్ళు మనసు మార్చుకుంటే ప్రమాదం. ఒక స్త్రీగా వాళ్ళతో వెళ్ళడం దుస్సాహసం. కానీ పిల్లలకన్నా తనకొచ్చేది పెద్ద ప్రమాదం కాదు పైగా తను బాధ్యతగల పోలీసు అధికారి.

విహారి ముందు సీట్లో కూర్చున్నాడు. ఆమెను మధ్యలో కూర్చో బెట్టుకుని ఇద్దరు టెర్రరిస్టులు వెనుక చెరోవేపు కూర్చున్నారు.

కారు స్టార్టయింది.

అందరూ ప్రేక్షకులై నిస్సహాయంగా చూస్తూ వుండగా కారు క్రమక్రమంగా అదృశ్యమైంది. దాన్ని వెంటాడే ప్రయత్నం చేయలేదు చీఫ్. అది అనవసరం అని అతడికి తెలుసు.

*　　　*　　　*　　　*

అరగంట ప్రయాణంచేసి పక్కదారి పట్టింది కారు. ఘాట్‌రోడ్డు ప్రవేశించింది. అడవి ప్రారంభమైంది.

ప్రవల్లిక బుష్ షర్టుమీద వుంది.

గోడ దగ్గిర రాళ్ళు ఎక్కేటప్పుడు పై బటన్ వూడిపోయివుంది. ఆమె దాన్ని చూసుకోలేదు. ఆమెది చాలా ఆరోగ్యవంతమైన శరీరం. మెడ క్రిందుగా నిలువుగీత- రెండో బటన్ దగ్గిర మడతలో అదృశ్యమవుతూ వుంది. అంత చీకట్లో కూడా ఆమె శరీరం తెల్లగా మెరుస్తోంది. కారు గతుకుల్లో పడ్డప్పుడల్లా ఆమె వక్షద్వయం పైకీ కిందకీ వూగడాన్ని ఆసక్తితో గమనిస్తున్నారు చెరోపక్క వడున్న ఇద్దరూ. ఒకడు ఆ అమ్మాయి తొడమీద చెయ్యివేసి నెమ్మదిగా పైకి జరిపాడు. ఆమె దానిని తీసెయ్యడానికి ప్రయత్నం చేసింది.

ఇంతలో కారు డ్రైవ్ చేస్తున్న వ్యక్తి అన్నాడు- "ఆ పిల్లాడినీ అమ్మాయినీ వదిలి మిమ్మల్నిద్దర్నీ తీసుకురావటానికి ఎందుకు ఒప్పుకున్నామో మీరేమైనా ఊహించగలిగారా?"

ప్రవల్లిక, విహారి మాట్లాడలేదు.

పిస్టల్ కొసతో ఆమె మెడక్రింద గీతని రాస్తూ "పోలీస్ డిపార్ట్‌మెంట్ కదా వూహించగలవా బేబీ?"

ఆమె ఒకచేత్తో పిస్టల్ తొలగిస్తూ మరో చేత్తో అతడి చెంపమీద కొట్టబోయింది. ఆ చేతిని గాలిలోనే పట్టుకునే, అతడు బిగ్గరగా నవ్వుతూ మొహంమీద ముసుగును తొలగించాడు.

ఆమె నిశ్చేష్టురాలయింది.